ఐపీఎల్ ముచ్చట్లు

టికెట్ ఉన్నా..సీటు లేకపాయె!

హైదరాబాద్, చెన్నై మ్యాచ్‌లో అభిమానికి వింత అనుభవం

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో జునైద్ అహ్మద్ అనే అభిమానికి వింత అనుభవం ఎదురైంది. మహేంద్రసింగ్ ధోనీకి వీరాభిమాని అయిన జునైద్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు రూ.4500 పెట్టి టికెట్ కొనుగోలు చేశాడు. తీరా స్టేడియంకు వచ్చి స్టాండ్స్‌లో చూస్తే జునైద్‌కు కేటాయించిన జే66 నంబర్ కనిపించలేదు. జే65, జే67 సీట్ల మధ్య తన నంబర్ 66 లేకపోవడంతో ఒక్కసారిగా అవాక్కయిన జునైద్ ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించాడు. సీటింగ్‌తో పాటు కొద్దిసేపు తాను నిలబడి ఉన్న చూస్తున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. తనకు జరిగిన అనుభవాన్ని వివరిస్తూ టికెట్ మొత్తం తిరిగి చెల్లిస్తారా అంటూ ఎక్స్‌లో ప్రశ్నించాడు. అయితే దీనిపై సోషల్‌మీడియాలో ఒక్కొక్కరు ఒక్కో రకంగా స్పందించారు. ఇదిలా ఉంటే ఇన్నింగ్స్ విరామ సమయంలో జే 69, జే70 సీట్ల మధ్య తన సీట్ దొరికిందంటూ జునైద్ ఫొటో షేర్ చేయడంతో ఈ ఘటనలో కొత్త ట్విస్ట్ క్రికెట్ అభిమానులకు మజా అందించింది.

ఉప్పల్ స్టేడియం విద్యుత్ సంక్షోభానికి తెర

వాయిదాల్లో చెల్లింపునకు అంగీకారం

సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): చైన్నై సూపర్ కింగ్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ క్రికెట్ మ్యాచ్‌కు ముందు ఉప్పల్ స్టేడియానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చేలరేగిన వివాదానికి తెరపడింది. 2015లో ప్రారంభమైన విద్యుత్ బిల్లు వివాదాన్ని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు శనివారం చర్చించి, సమస్యను సామరస్యంగా పరిష్కరించడానికి మార్గం సుగమం చేశారు. ఇందులో భాగంగా వాయిదా పద్ధతిలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తామని హెచ్‌సీఏ పెట్టిన ప్రతిపాదనను టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ అంగీకరించారు. దీంతో తొలి వాయిదాను త్వరలోనే చెల్లిస్తామని హెచ్‌సీఏ తెలిపింది. ఉప్పల్ క్రికెట్ స్టేడియంకు సంబంధించిన మొత్తం విద్యుత్ బకాయిలు సుమారు రూ.1.67 కోట్లుగా ఉందని, మొత్తం ఎన్ని వాయిదాల్లో చెల్లిస్తారన్నది విద్యుత్ అధికారులు స్పష్టం చేయలేదు.

కజకిస్థాన్ చాంప్ తరుణ్

అస్తానా: కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ యువ షట్లర్ తరుణ్ మన్నెపల్లి విజేతగా నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో తరుణ్ 21-10, 21-19తో ఎనిమిదో సీడ్ సూంగ్ జూ వెన్(మలేషియా)పై అలవోక విజయం సాధించాడు. ఈ క్రమంలో తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు మహిళల సింగిల్స్ తుది పోరులో అనుపమ ఉపాధ్యాయ 21-15, 21-16తో భారత్‌కే చెందిన ఇషారాణి బరుహపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సంజయ్ శ్రీవాస్తవ, మనీష జోడీ 21-9, 7-21, 12-21తో వాంగ్‌టైన్ సిలిమ్, లిమ్ చీవ్ సియెన్ ద్వయం చేతిలో ఓడి రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది.

బట్లర్ (100 నాటౌట్)

కోహ్లీ కొట్టుడు బట్లర్ బాదుడు

- సూపర్ సెంచరీలతో విజృంభణ
- రాజస్థాన్ రాయల్స్‌దే విజయం
- బెంగళూరుకు తప్పని పరాభవం

ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను కట్టిపడేసింది. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లుగా ప్రశంసలు పొందుతున్న విరాట్ కోహ్లీ, జాస్ బట్లర్ ఒకే మ్యాచ్‌లో సెంచరీలతో విరుచుకుపడితే రెండు కండ్లు చాలవనుకో. శనివారం రాజస్థాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) పోరులో ఇదే జరిగింది. తొలుత రాజస్థాన్ బౌలర్లను చెడుగుడు ఆడుతూ విరాట్ సెంచరీతో విజృంభిస్తే.. రాజస్థాన్ విధ్వంసకారుడు బట్లర్ ఆఖరి బంతికి సిక్స్‌తో శతకగర్జన చేశాడు. మొత్తంగా రెండు సూపర్ సెంచరీలు నమోదైన మ్యాచ్‌లో బెంగళూరుపై రాజస్థాన్‌దే పైచేయి అయ్యింది.

రాజస్థాన్: ఐపీఎల్‌లో రాజస్థాన్, బెంగళూరు మ్యాచ్ అభిమానులకు పసందైన విందు అందించింది. టికెట్ ధరకు రెండింతల మజానను ఫ్యాన్స్ పొందారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై అద్భుత విజయం సాధించింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో రాయల్స్ 8 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంటే..ఆర్‌సీబీ నాలుగో ఓటమితో ఎనిమిదో స్థానానికి పరిమితమైంది. ఆర్‌సీబీ నిర్దేశించిన 184 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్థాన్ 19.1 ఓవర్లలో 189/4 స్కోరు చేసింది. బట్లర్(58 బంతుల్లో 9ఫోర్లు, 4సిక్స్‌లు)సూపర్ సెంచరీతో కదంతొక్కగా, కెప్టెన్ శాంసన్(42 బంతుల్లో 69, 8ఫోర్లు, 2 సిక్స్‌లు) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. టోప్లే(2/27) రెండు వికెట్లు తీశాడు. తొలుత విరాట్ కోహ్లీ(72 బంతుల్లో 113 నాటౌట్,12 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక విజృంభణకు తోడు కెప్టెన్ డుప్లెసిస్(44) ఆకట్టుకోవడంతో బెంగళూరు 20 ఓవర్లలో 183/3 స్కోరు చేసింది. మ్యాక్స్‌వెల్(1), సౌరవ్ చౌహాన్(9), గ్రీన్(5 నాటౌట్) స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. చాహల్(2/34), బర్గర్(1/33) రాణించారు. సెంచరీతో జట్టు విజయంలో కీలకమైన బట్లర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఆదివారం ఐపీఎల్‌లో డబుల్ ధమాకా పోరు అభిమానులను అలరించనుంది.

బట్లర్ బాదేశాడు:

నిర్దేశిత లక్ష్యఛేదనలో రాజస్థాన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. టోప్లె ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ యశస్వి జైస్వాల్(0) పరుగులేమి చేయకుండానే నిష్క్రమించాడు. ఈ తరుణంలో క్రీజులోకొచ్చిన శాంసన్, బట్లర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరు పసలేని ఆర్‌సీబీ బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ఆదిలో కొంత నెమ్మదిగా ఆడిన బట్లర్ క్రీజులో కుదురుకున్నాక బ్యాటుకు పనిచెప్పాడు. మరోవైపు మంచి టచ్‌లో ఉన్న శాంసన్..ఆర్‌సీబీ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ బౌండరీలతో రాణించాడు. ఫలితంగా పవర్ ప్లే ముగిసే సరికి రాయల్స్ వికెట్ కోల్పోయి 54 పరుగులు చేసింది. ఈ క్రమంలో బట్లర్ తొలుత అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, శాంసన్ అతన్ని అనుసరించాడు. ఈ జోడీని విడదీసేందుకు కెప్టెన్ డుప్లెసిస్ ఎన్ని ప్రయోగాలు చేసినా లాభం లేకపోయింది. దీనికి తోడు ఆర్‌సీబీ చెత్త ఫీల్డింగ్ రాయల్స్‌కు కలిసొచ్చింది. సిరాజ్ ఇన్నింగ్స్ 15వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన శాంసన్ రెండో వికెట్‌గా వెనుదిరగడంతో 148 పరుగుల భాగస్వామ్యం బ్రేక్ అయ్యింది. ఆ తర్వాత వచ్చిన పరాగ్(4), జురెల్(2) వెంటవెంటనే ఔటయ్యారు. ఆఖర్లో హెట్‌మైర్(11 నాటౌట్) జతగా బట్లర్ జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. ఆఖరి ఓవర్లో విజయానికి ఒక పరుగు అవసరమైన దశలో బట్లర్ సిక్స్ కొట్టి సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 183/3(కోహ్లీ 113 నాటౌట్, డుప్లెసిస్ 44, చాహల్ 2/34, బర్గర్ 1/33), **రాజస్థాన్:** 19.1 ఓవర్లలో189/4 (బట్లర్ 100 నాటౌట్, శాంసన్ 69, టోప్లె 2/27, సిరాజ్ 1/35)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	4	4	0	1.12	8
కోల్‌కతా	3	3	0	2.51	6
చెన్నై	4	2	2	+0.51	4
లక్నో	3	2	1	0.48	4
హైదరాబాద్	4	2	2	+0.40	4
పంజాబ్	4	2	2	-0.22	4
గుజరాత్	4	2	2	-0.58	4
బెంగళూరు	5	1	4	-0.84	2
ఢిల్లీ	4	1	3	-1.34	2
ముంబై	3	0	3	-1.42	0

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

కోహ్లీ (113 నాటౌట్)

కోహ్లీ ఒక్కడే

తొలుత టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్..బెంగళూరును బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. లీగ్‌లో సూపర్ ఫామ్‌మీదున్న విరాట్‌కోహ్లీ, కెప్టెన్ డుప్లెసిస్‌తో కలిసి జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. రాజస్థాన్ బౌలింగ్‌ను ఆది నుంచే తమదైన ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్న ఈ జోడీ స్కోరుబోర్డుకు అలవోకగా పరుగులు జత చేశారు. ముఖ్యంగా కోహ్లీ..బర్గర్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ నుంచే బౌండరీలతో దూకుడు ప్రదర్శించాడు. వీరిద్దరు పరుగులు సాధించడంలో పోటీ ప్రదర్శించారు. వీరి దూకుడు ఐదోఓవర్లో అశ్విన్ మూడు పరుగులే ఇచ్చి ఒక రకంగా అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరి కి బెంగళూరు వికెట్ కోల్పోకుండా 53 పరుగులు చేసింది. ఓవైపు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో రాజస్థాన్ ప్రయత్నిస్తే..అంతే దీటుగా కోహ్లీ, డుప్లెసిస్ పరుగులు సాధించేందుకు ప్రయత్నించారు. బౌల్ట్ తొమ్మిదో ఓవర్లో డుప్లెసిస్ రెండు సిక్స్‌లు బాదితే..చాహల్ ఓవర్లో కోహ్లీ సిక్స్ అరుసుకున్నాడు. పరాగ్ 11వ ఓవర్లో డుప్లెసిస్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ క్రమంలో 39 బంతుల్లో కోహ్లీ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. వీరిని అడ్డుకునేందుకు స్పిన్ ద్వయం అశ్విన్, చాహల్‌ను ప్రయోగించడం రాజస్థాన్‌కు కలిసొచ్చింది. ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో చాహల్ బౌలింగ్‌లో 65 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ క్యాచ్‌ను బర్గర్ జారవిడువగా, డుప్లెసిస్‌కు మరోమారు లైఫ్ లభించింది. అయితే మరుసటి బంతికే బట్లర్ క్యాచ్‌తో డుప్లెసిస్ ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 125 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన మ్యాక్స్‌వెల్(1), సౌరవ్ చౌహాన్(9) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగి తీవ్రంగా నిరాశపరిచారు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..కోహ్లీ కొట్టుడు మాత్రం ఆపలేదు. గ్రీన్(5 నాటౌట్) జతగా కోహ్లీ ఐపీఎల్ కెరీర్‌లో ఎనిమిదో సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు.

జాతీయ శిబిరానికి సంగీత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారత అథ్లెటిక్స్ శిక్షణా శిబిరానికి తెలంగాణ యువ అథ్లెట్ దొడ్ల సాయిసంగీత ఎంపికైంది. దుబాయ్ వేదికగా ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జరుగనున్న జూనియర్ ఆసియా టోర్నీ కోసం బెంగళూరు సాయ్ కేంద్రంలో అథ్లెట్లు శిక్షణ పొందనున్నారు. ఇందులో 62 మంది అథ్లెట్లు, 15 మంది కోచ్‌లు ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి నాగపురి రమేశ్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

భారత్ భారీ ఓటమి

ఆస్ట్రేలియాతో హాకీ సిరీస్

పెర్త్: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్ కోసం సన్నద్ధమవుతున్న భారత హాకీ జట్టుకు ఆస్ట్రేలియా పర్యటనలో చుక్కెదురైంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 1-5తేడాతో ఆసీస్ చేతిలో భారీ ఓటమి చవిచూసింది. ఆసీస్ తరపున టామ్ హిక్‌హమ్ (20ని,38ని), టిమ్ బ్రాండ్ (3ని), జోయెల్ రింటాలా(37ని), ప్లిన్ ఓగ్లివి (57ని) గోల్స్ చేశారు. గుర్జాంత్‌సింగ్ (47ని) భారత్‌కు ఏకైక గోల్ అందించాడు. ఆది నుంచే తమదైన ఆధిపత్యం ప్రదర్శించిన కంగారూలు ఆట మొదలైన మూడో నిమిషంలోనే గోల్ ఖాతా తెరిచాడు. భారత డిఫెన్స్ లోపాలను అనుకూలంగా మలుచుకుంటూ ఆసీస్ వరుస విరామాల్లో గోల్స్ చేసింది.

భాంబ్రీ జోడీ నిష్క్రమణ

మరాకెచ్(మొరాకో): మారకెచ్ ఓపెన్ టోర్నీలో భారత యువ టెన్నిస్ ప్లేయర్ యుకీ భాంబ్రీ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో భాంబ్రీ, అల్బనో ఒలివెటి (ఫ్రాన్స్) జోడీ 5-7, 6-3, 7-10తో రెండో సీడ్ లుకాస్ మీడ్లెర్, అలెగ్జాండర్ ఎర్లెర్ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. ఇదిలా ఉంటే ఏటీపీ హోస్టన్ ఓపెన్ సెమీస్‌లో శ్రీరామ్ బాలాజీ, అండ్రీ జోడీ 7-6(5), 2-6, 3-10తోమ్యాక్స్ పుర్సెల్, జోర్డాన్ జంట చేతిలో ఓడి వైదొలిగింది.

వాణిజ్య

ఏథర్ సరికొత్త స్కూటర్

ప్రారంభ ధర రూ.1.10 లక్షలు

బెంగళూరు, ఏప్రిల్ 6: ప్రముఖ ఈవీ స్కూటర్ల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ..దేశీయ మార్కెట్‌కు నయా స్కూటర్‌ను పరిచయం చేసింది. రిజ్టా పేరుతో విడుదల చేసిన ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.10 లక్షలుగా నిర్ణయించింది. రెండు రకాల్లో లభించనున్న ఈ స్కూటర్ రిజ్టా ఎస్, రిజ్టా జెడ్ మాడళ్లు. సింగిల్ చార్జింగ్‌తో 2.9 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 123 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 3.7 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 160 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. సీటు కింద 34 లీటర్ల స్టోరేజీ స్పేస్ కలుపుకొని మొత్తంగా 56 లీటర్ల స్టోరేజీతో తయారు చేసింది. ఫోన్లు, ట్యాబ్లెట్స్, పోర్టబుల్ స్పీకర్లు చార్జింగ్ చేసుకోవచ్చును. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఈ మాడల్‌పై ఐదేండ్లు లేదా 60 వేల కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయం కల్పించింది. సంస్థ నుంచి మార్కెట్లోకి వచ్చిన రెండో మాడల్ ఇది కావడం విశేషం.

జోయాలుక్కాస్ ఉగాది ఆఫర్

బంగారం కొనుగోలుపై ఉచితంగా వెండి అందజేత

Joyalukkas

బెంగళూరు, ఏప్రిల్ 6: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్ ఉగాది పండుగ ఆఫర్లను ప్రకటించింది. ఈ నెల 10 వరకు అమల్లో ఉండనున్న ఈ ఆఫర్ కింద ప్రతి బంగారు ఆభరణాల కొనుగోలుపై అంతే బరువుగల వెండిని ఉచితంగా అందిస్తుంది. ఈ ఆఫర్లు తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న షోరూంలలో లభించనున్నదని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ అలుక్కాస్ అన్నారు.

జిగేల్‌మన్న పసిడి

71 వేలు దాటిన తులం ధర • హైదరాబాద్‌లో రూ.1,310 పెరుగుదల

హైదరాబాద్, ఏప్రిల్ 6: బంగారం సామాన్యుడికి అందనంటున్నది. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి ధర మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. రోజుకొక రికార్డు బద్దలు కొడుతున్న గోల్డ్ ధర శనివారం మరో మైలురాయి రూ.71 వేలు అధిగమించింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు పుంజుకోవడంతో దేశీయంగా భగభగమండుతున్నది. ఇదే క్రమంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 22 క్యారెట్ కలిగిన పదిగ్రాముల ధర రూ.1,200 ఎగబాకి రూ.64,150 నుంచి రూ.65,350కి చేరుకున్నది. అలాగే 24 క్యారెట్ కలిగిన 99.9 స్వచ్ఛత కలిగిన తులం బంగారం ధర రూ.1,310 అధికమై రూ.71,290 పలికింది. ఒకేరోజు ఇంతటి స్థాయిలో పెరగడం విశేషం. ఇదిలావుంటే ఢిల్లీలో తులం ధర రూ.1,310 ఎగబాకి రూ.71,440 పలికింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెండ్లిళ్ల సీజన్ అయినప్పటికీ కొనుగోళ్లు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. అవసరం ఉంటే తప్పా కొనుగోళ్లు చేయడం లేదని బంగారం వ్యాపారి ఒకరు తెలిపారు.

పసిడితోపాటు వెండి కూడా...

బంగారంతోపాటు వెండి పరుగులు పెడుతున్నది. హైదరాబాద్‌లో కిలో వెండి ఏకంగా రూ.2 వేలు అధికమై రూ.85 వేల నుంచి రూ.87 వేలకు చేరుకున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటమే ఇందుకు కారణం. ఢిల్లీలో వెండి రూ.83,500 పలికింది. శుక్రవారంతో పోలిస్తే రూ.1,800 పెరిగినట్లు అయింది. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు వెల్లడిస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించనున్నట్లు సంకేతాలివ్వడం, రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతుండటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణం.

విప్రో సీఈవో థియరీ రాజీనామా

కొత్త సీఈవోగా శ్రీనివాస్ పల్లియ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన విప్రోలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. కంపెనీ సీఈవో థియరీ డెలాపోర్టే తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేశారు. థెర్రీ రాజీనామాను ఆమోదించిన కంపెనీ బోర్డు..ఈ స్థానంలో శ్రీనివాస్ పల్లియ నియమించింది. ఈ నియామకం వెంటనే అమలులోకి రానున్నట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. థెర్రీ రాజీనామా చేసినప్పటికీ మే 31, 2024 వరకు కంపెనీలో విధులు నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం 7 గంటలకు కంపెనీ బోర్డు సమావేశమై డెలాపోర్టే రాజీనామాపై చర్చించిన అనంతరం..ఈ స్థానంలో శ్రీనివాస్‌ను నియమకానికి పచ్చజెండా ఊపింది. ఆయన ఐదేండ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇందుకోసం వాటాదారులు, నియంత్రణ మండళ్లు అనుమతించాల్సి ఉంటుందని పేర్కొంది. గత మూడు దశాబ్దాలకు పైగా సంస్థలో పలు హోదాలో పనిచేసిన పలయకు పదోన్నతి లభించినట్లు అయింది. 1992లో విప్రోలో చేరిన ఆయన..విప్రో కన్జ్యూమర్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్‌గాను, బిజినెస్ అప్లికేషన్ సర్వీసెస్ గ్లోబల్ హెడ్‌గా విధులు నిర్వహించారు.

డెలాపోర్టేకు అత్యధిక వేతనం

56 ఏండ్ల వయస్సు కలిగిన ఫ్రాన్స్‌కు చెందిన డెలాపోర్టే.. విప్రోలో చేరకముందు క్యాప్‌జెమినీ చీఫ్ ఆపరేటింగ్ అధికారికిగా విధులు నిర్వహించారు. జూలై 2020 నుంచి ఆయన విప్రో సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. గతేడాది చివరివరకు దేశీయ ఐటీ రంగంలో అత్యధిక వేతనం అందుకుంటున్న డెలాపోర్ట్..ఏడాదికి రూ.82 కోట్ల చొప్పున వేతనాన్ని అందుకుంటున్నారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్ సీఈవోల కంటే అధికంగా పొందుతున్నారు. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు, ఈ రాజీనామా ఈ నెల 6 నుంచి అమలులోకి రానున్నది..ఇది ఒక అపురూపమైన గౌరవం, సంస్థ వృద్ధి, విజయంలో పాత్ర పోషించినందుకు చాలా సంతోషిస్తున్నా. గత నాలుగేండ్లలో సంస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాను. ముఖ్యంగా క్లయింట్లకు, అసోసియేట్లకు, వాటాదారులకు ఎన్నో ప్రయోజనాలు లభించాయని డెలాపోర్టే రాసిన లేఖలో పేర్కొన్నారు. రాజీనామా చేసినప్పటికీ మే 31 వరకు సంస్థలోనే కొనసాగనున్నట్లు ప్రకటించారు.

హైదరాబాద్‌లో జీస్ విజన్ సెంటర్

హైదరాబాద్, ఏప్రిల్ 6: ఆప్టిక్స్, ఆప్టో ఎలక్ట్రానిక్స్ సైన్స్‌లో ప్రపంచ అగ్రగామి సంస్థల్లో ఒకటైన జీస్..హైదరాబాద్‌లో తమ తొలి జీస్ విజన్ సెంటర్‌ను ప్రారంభించింది. స్పెక్స్‌బంకర్‌తో కలిసి జూబిలీహిల్స్, హైదరాబాద్‌లో వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా స్పెక్స్‌బంకర్ వ్యవస్థాపకుడు, సీఈవో మోహిత్ అగర్వాల్ మాట్లాడుతూ..రెండేండ్ల క్రితం బెంగళూరులో ప్రారంభించిన జీస్ సెంటర్‌కు అనూహ్య స్పందన రావడంతో దక్షిణాదిలో మరో సెంటర్‌ను ప్రారంభించాలను ఉద్దేశంతో హైదరాబాద్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. భారత్‌లో కళ్లజోళ్ల పరిశ్రమకు పూర్వ వైభవం తేవడంతోపాటుగా కంటి సంరక్షణ ప్రమాణాలు పెంచడానికి ఈ విజన్ సెంటర్ దోహదం చేయనున్నదన్నారు. ఈ సెంటర్‌లో అంతర్జాతీయ ఫ్రేమ్‌లు, సన్‌గ్లాసెస్ బ్రాండ్‌లతో పాటు లెన్స్‌లు కూడా లభించనున్నాయి.

జోష్ లేని జాతర

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల ముందు ఇదే ప్రాంగణంలో నిర్వహించిన జోష్ కూడా ఇప్పుడు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ఇది లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీని కలవరపాటుకు గురి చేసే పరిణామంగానే పరిశీలకులు భావిస్తున్నారు.

పార్లమెంటు ఎన్నికల దరిమిలా అధికార కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం నిర్వహించిన జన జాతర బహిరంగ సభ ఆద్యంతం చప్పగా కనిపించింది. వాస్తవానికి కాంగ్రెస్ నేతలు ముందుగా ప్రకటించినట్లు పది లక్షలు కాకున్నా.. కనీసంగా ఐదారు లక్షల మందితో సభ జరుగుతుందని అందరూ అంచనా వేశారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ ఢిల్లీ అధిష్ఠానం ఎంతో నమ్మకంతో ఈ బహిరంగ సభకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ వంటి హేమాహేమీలు సభకు హాజరయ్యారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలను ప్రకటించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను ఎంచుకున్నారు. రాజీవ్‌గాంధీ సభా ప్రాంగణం పేరుతో సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకతో ఇక్కడ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో పార్టీ అధికారాన్ని చేపట్టింది. అందుకే భారీ బహిరంగ సభతో పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అదే తరహా సత్తాను చాటుతుందని చెప్పేందుకు అచ్చి వచ్చిన ఆ సభా ప్రాంగణాన్నే మరోసారి ఎంపిక చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేసిన ఒక్క రోజు తర్వాత హైదరాబాద్‌లో తలపెట్టిన ఈ సభను కాంగ్రెస్ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకను కాదని హై కమాండ్ హైదరాబాద్‌ను ఎంచుకున్న నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ సభా ఏర్పాట్లపై భారీ హైప్ క్రియేట్ చేసింది. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ, ప్రభుత్వం రెండు ఉన్నందున జన జాతర మోత మోగుతుందని చాలామంది అనుకున్నారు. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లలోనూ పాలనా యంత్రాంగమే నిమగ్నమైంది. అన్ని జిల్లాల నుంచి జనం, పార్టీ శ్రేణుల్ని సమీకరించేందుకు ప్రణాళిక కూడా రూపొందించుకున్నారు. సభా ఏర్పాట్లను సీఎం, మంత్రులు స్వయంగా పర్యవేక్షించారు. ఈ క్రమంలోనే జన జాతరను ఏకంగా పది లక్షల మందితో నిర్వహించి అగ్ర నేత రాహుల్‌ను సంతృప్తిపరచాలని అన్ని శక్తులూ ఒడ్డారు. కానీ ఎక్కడ తేడా కొట్టిందోగానీ... ఆశించిన దానిలో కనీసం పట్టుమని పది శాతం జనం రాకపోగా, వచ్చిన క్యాడర్‌లోనూ మునుపటి జోష్ కనిపించలేదనే విశ్లేషణలు రాజకీయ పరిశీలకుల నుంచి వెలువడుతున్నాయి